ప్రజాశక్తి

ఆదివారం 25 జూన్ 2023



ఉద్యోగుల సమస్యలపై పోరాటం: యుటిఎఫ్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తామని స్థానిక యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ నారాయణ, ఎస్.బాలకృష్ణ చెప్పారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో యుటిఎఫ్ మండల శాఖ కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉద్యోగులను ప్రభుత్వం అనేక విధాలుగా నయవంచన చేసిందన్నారు. సిపిఎస్‌ని వారం రోజుల్లో రద్దు చేస్తానని హామీనిచ్చి జిపిఎస్‌ను బలవంతంగా రుద్దుతుందన్నారు. దీంతో ఉద్యోగులు అనేక విధాలుగా నష్టపోతున్నారన్నారు. జిపిఎస్‌ని ఎప్పటికీ ఉద్యోగులు అంగీకరించరన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఎం.మోహన్, కే బాబ్జి, బి.శ్రావణ్ కుమార్, మల్లికార్జున్, మేఘనాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ నేతలు

గ్రామగ్రామానా నిర్వాసితులను కదిలిస్తూ..

100 కిలో మీటర్ల మైలురాయి దాటిన పోరుకేక పాదయాత్ర



భారీ జన సమూహంతో సాగుతున్న పోరుకేక పాదయాత్ర

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, చింతూరు

కదం తొక్కుతూ... పదం పాడుతూ పోలవరం నిర్వాసితుల మహాపాదయాత్ర ముందుకు సాగుతోంది. పోలవరం నిర్వాసితుల హక్కుల సాధన కోసం సిపిఎం చేపట్టిన పాదయాత్ర ఐదో రోజైన శనివారం చింతూరు జిల్లాలో సుమారు 15 కిలో మీటర్లు పర్యటించింది. ఎటపాకల మండలం నెల్లిపాకలో ఈ నెల 20న యాత్ర ప్రారంభం కాగా శనివారం సాయంత్రానికి 100 కిలో మీటర్ల మైలు రాయిని దాటింది. ఏజెన్సీలోని విలీన మండలాల్లోని ప్రజలు పాదయాత్ర ఎదుట తమ గోడు వెలిబుచ్చటంతో పాటు గ్రామ గ్రామాన పోరుయాత్రలో కలిసి వస్తున్నారు. ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలపిస్తున్న గేయాలకు కలిసి పదం పాడుతున్నారు.

పాదయాత్ర ఎదుట సమస్యల తోరణం

పాదయాత్ర బృందం పోలవరం నిర్వాసితులను పలకరించగా వివిధ తరగతుల ప్రజలు వారివారి సమస్యలను వివరించారు. నెల్లిపాకలో అత్యధిక మంది దళితులు నివసిస్తున్నామని, రైతులకు భూమికి భూమి ఇస్తామంటున్నారని, వ్యవసాయ కూలీల ఉపాధి గురించి ప్రభుత్వం పట్టించుకోవటం లేదని వాపోయారు. చిరు వ్యాపారులు తమ పాధిని కోల్పోతున్నామని, పరిహారం ప్రకటించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. బుట్టయిగూడెంలో అత్యధిక మంది పట్టాలు లేని భూమిని సాగు చేసుకుంటున్నామని, తమను సాగుదారులుగా గుర్తించి పట్టాదారులతో సమానంగా పరిహారం ఇవ్వాలని కోరారు. నందమూరి గ్రామంలో అత్యధిక మంది గొర్రెలు కాపరులుగా జీవనోపాధి పొందుతున్నారని, తమకు కల్పించే పునరావాస కాలనీలలో జీవాలను మేపుకునేందుకు ఆవాసయోగ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తోటపల్లి గ్రామంలో అత్యధిక మంది దళితులు, గిరిజన తెగలో కోయనాయకపోడు ప్రజలు ఉన్నారని, తమకు భూములు లేకపోవటంతో రెక్కల కష్టంపై బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గన్నవరంలో సెంటు భూమి కూడా లేని ప్రజలు అత్యధిక మంది ఉన్నారని, ప్రభుత్వం పునరవాసం కల్పించాలని కోరారు. నందిగామ గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయని, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ముంపు పేరుతో అభివృద్ధి పనులు చేపట్టడం లేదని వాపోయారు. మురుమూరు గ్రామం ముందు మునిగిపోతోందని ఆర్ అండ్ ఆర్ పునరవాసం తక్షణం కల్పించాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని అందరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, పునరావాసం కల్పించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. పాదయాత్రకు అన్ని ప్రాంతాల్లోనూ పెద్ద ఎత్తున వినతిపత్రాలను అందజేస్తున్నారు. తమ హక్కుల సాధనకోసం ఐక్యంగా పోరాడేందుకు కలిసి వెళ్తున్నట్లు ప్రజలు తెలిపారు.

నేడు రామవరం నుండి మహా పాదయాత్ర

ప్రజాశక్తి -విఆర్.పురం

పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం చేపట్టిన మహాపాదయాత్ర 6వ రోజు విఆర్.పురం మండలం రామవరంలో ప్రారంభం కానుంది. పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన ప్రజలు ఇప్పుడు వర్షాకాలంలో వరదల వల్ల ముంపునకు గురై ఏమి చేయాలో దిక్కు తోచని అయోమయంలో ఉన్నారు. నిర్వాసితుల గోడు పట్టన పాలకులకు వినిపించి, వారి కళ్ళు తెరిపించేలా వందలాది మంది పాదయాత్రలో నడుస్తున్నారు. నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం ప్యాకేజీ, పునరావాసం ఇవ్వాలని, గోదావరి వరదల నుండి ప్రజలను రక్షించడానికి ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని, గత వరదల్లో నష్ట పోయిన కుటుంబాలకు ప్యాకేజీ ఇవ్వాలని, పారదర్శకంగా లేని తప్పుల తడకగా ఉన్న కాంటూరు కాకి లెక్కలు మార్చి, 1986, 2022 సంవత్సరాలలో గోదావరి వరదల్లో మునిగిన గ్రామాలన్నింటినీ మొదటి దఫా పరిహారంలో చేర్చాలని పాదయాత్ర డిమాండ్ చేస్తుంది. విఆర్.పురం మండలంలో ప్రవేశించే మహా పాదయాత్రలో నిర్వాసితులంతా పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం మండల నాయకులు కోరారు.



పాదయాత్రకు ఆర్థిక సాయం అందిస్తున్న చింతూరు మహిళలు



పాదయాత్రలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ, సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి మధు



పాదయాత్రకు మద్దతు తెలియజేసిన సిపిఎం ఒడిశా రాష్ట్రం నాయకులు

జోరు వానలోనూ...

పాదయాత్రకు పలువురు మద్దతు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి, చింతూరు

ఓ వైపు జోరు వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా పోలవరం నిర్వాసితుల పోరుకేక పాదయాత్ర శనివారం ముందుకు సాగింది. ఎజి కోడేరులో మాజీ ఎంపీ, ఆదివాసీ రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్ మిడియం బాబూరావు, నర్సింగపేటలో మాజీ ఎంపీ, సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి పి.మధు, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ పాల్గొన్నారు. వారి ప్రసంగాలు నిర్వాసితుల్లో మరింత ఉత్సాహాన్ని నింపాయి. నర్సింగపేటలో పాదయాత్రకు ఘన స్వాగతం లభించింది. మాజీ ఎంపిపి రవ్వ రాజయ్య సంఘీభావం తెలిపారు. ఆ ప్రాంత మహిళలు హారతులు పట్టారు. జనసేన నాయకులు మడివి రాజు ప్రత్యక్షంగా పాల్గొని తన మద్దతు తెలియజేశారు. సిపిఎం ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కార్యదర్శి బృజామాజీ, నాయకులు కృష్ణా పాండే, సునిల్ పాణిగ్రహి పాల్గొని పాదయాత్రకు సంఘీభావం ప్రకటించారు. అక్కడి నుంచి తిమ్మిరిగూడెం మీదుగా ఎజి కోడేరుకు పాదయాత్ర చేరుకుంది. ఎంపిటిసి జల్లి లావణ్య స్థానిక మహిళలతో కలిసి తిలకం దిద్ది హారతిపట్టారు. అక్కడ భోజనం విరామం అనంతరం పాదయాత్ర ఉలుమూరు చేరగా గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు. ప్రజానాట్య మండలి కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అక్కడి నుంచి పాదయాత్ర మల్లెతోట చేరుకుంది. గత వరదలలో పూర్తిగా ధ్వంసమైన ఇళ్లను నాయకులు సందర్శించారు. ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాదయాత్ర విఆర్.పురంలోని చొప్పల్లి మీదుగా రామవరం చేరుకుంది. అక్కడ రాత్రి బస చేశారు. ఈ పాదయాత్రలో పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, జిల్లా కార్యదర్శి పులి సంతోష్, సిపిఎం చింతూరు మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, పూనెం సత్యనారాయణ, పల్లపు వెంకట్, మట్ల వాణిశ్రీ, ప్రజాప్రతినిధులు కారం లక్ష్మి, కుంజా రాధ, లావణ్య, నాయకులు పొడియం లక్ష్మణ్, కారం నాగేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ధనలక్ష్మి కార్యక్రమానికి పలచగా జనం..

సిపిఎం పాదయాత్రతోనే కదిలిన ప్రజానీకం

ఎజి కోడేరులో పోరుకేక పాదయాత్ర సభ నిర్వహించే ప్రాంతం సమీపంలోనే సచివాలయ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎంఎల్ఎ ధనలక్ష్మి హాజరయ్యారు. గ్రామ ప్రజలు అక్కడకు వెళ్లకుండా పోరుకేక పాదయాత్రలో అధికంగా పాల్గొన్నారు. ఇది ఆదివాసీలకు సిపిఎంతో ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పింది. ఈ క్రమంలో భవన ప్రారంభోత్సవం కార్యక్రమానికి ప్రజాదరణ లభించక పోవటంతో ఎంఎల్ఎ కేవలం 15 నిమిషాలలోనే కార్యక్రమం ముగించుకుని వెనుదిరిగారు.

అధ్యాపకులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ 11 మండలాలు, ఉమ్మడి విశాఖ జిల్లాలో గత తొమ్మిది సంవత్సరాలుగా కస్తూరిబా గాంధీ పాఠశాలలు, కళాశాలలో విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులు, గెస్ట్ ఫ్యాకల్టీని రెన్యూవల్ చేసి, తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గత తొమ్మిది సంవత్సరాలుగా కస్తూరిబా పాఠశాల, కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా విధులు నిర్వహిస్తు అనుభవం ఉన్న ఉపాధ్యాయులను రెన్యూవల్ చేయకుండా కొత్తగా నోటిఫికేషన్ రిక్రూట్మెంట్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. తక్షణమే దీన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 11 మండలాలలో కస్తూరాబాలో పని చేస్తున్న 40 మంది ఉద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కొత్త నోటిఫికేషన్‌లో సర్టిఫికెట్లు వెరిఫికేషన్, డెమో ద్వారా ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులు ఖాళీలు మాత్రమే భర్తీ చేయాలని, ప్రస్తుతం పని చేస్తున్న అధ్యాపకులను తొలగించే పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం సరి కాదన్నారు.తక్షణమే కొత్త రిక్రూట్మెంట్లు ఆపాలని, ఖాళీగా ఉన్న పోస్టులకు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మణరావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్త రహదారితో అవస్థలు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని దిగుడు పుట్టు బ్రిడ్జి నుంచి కామయ్యపేట వరకు గోతుల రహదారితో ప్రయాణీకులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండా నిత్యం వందల సంఖ్యలో ఒడిశా, ఆంధ్ర సరిహద్దు వాసులు రోకపోకలు సాగిస్తుంటారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా రహదారి సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. నాయకులు, అధికారులు పట్టించుకోక పోవడంతో గత్యంతరం లేక గుంతల రహదారి పై ఇక్కట్లు పడుతున్నారు. ప్రతి రోజు ఈ రహదారి పై నుంచి స్కూల్ పిల్లలు, టీచర్లు ప్రయాణిస్తుంటారు. వర్షం కురిస్తే రహదారి చిత్తడిగా మారుతోంది. తీగలవలస, తడిగిరి, మోట్టుజోరు 3 పంచాయతీల్లో 50 గ్రామాలు ఉన్నారు. వీరంతా దీర్ఘకాలికంగా ఈ రహదారి సమస్య పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా రహదారి సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతూన్నారు.



అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు

తాగునీటి ట్యాంక్ ఏర్పాటు

ప్రజాశక్తి- పెదబయలు : సీతాగుంట పంచాయతీ రోగులపేట కొలనిలో స్థానిక జడ్పీటీసీ కె.బొంజుబాబు నిధులతో మంచినీటి ట్యాంక్ ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. స్థానిక జడ్పీటీసీ బొంజుబాబు రెండేళ్ల క్రితం ఇచ్చిన హామీ మేరకు పనులు చేపడుతున్నామన్నారు. రోగుల పేట కొలనిలో గత కొన్నేళ్లుగా నీటి ఎద్ద డి తీవ్రత అధికంగా ఉండటంతో స్థానిక జడ్పీటీసీ దృష్టికి కాలని వాసులు తీసుకెళ్లారు. జడ్పీ నిధులు మూడు లక్షలు మంజూరు చేయగా గ్రామానికి మూడు వందల మీటర్ల దూరంలో బోరుబావిని తవ్వించి కొండమీద 5వేల లీటర్ల ట్యాంకును ఏర్పాటు చేయనున్నారు. కాలని వాసులు స్థానిక జడ్పీటీసీకి కృజ్ఞతలు తెలిపారు.

సీలేరు నైట్ హాల్ట్ బస్సు పునరుద్ధరణ

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు నైట్‌హాల్ట్ బస్సు సర్వీస్‌ను పునరుద్ధరిస్తున్నట్లు ఆర్టీసీ విశాఖపట్నం డిపో అసిస్టెంట్ మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన ప్రజాశక్తితో ఫోన్లో మాట్లాడుతూ సీలేరు ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి సీలేరు నైట్ హాల్ట్ బస్సును పునరుద్ధరించాలని లేఖ ద్వారా విన్నవించారని చెప్పారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు, డిపో మేనేజర్ గంగాధర్, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ స్పందించి సీలేరు నైట్ హాల్ట్ బస్సును ఈ నెల 25వ తేదీ నుండి నడపడానికి చర్యలు చేపట్టారని తెలిపారు. విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటలకు ఈ బస్సు బయలుదేరి నర్సీపట్నం మీదుగా సీలేరుకు రాత్రి 10 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. మరుసటి రోజు ఉదయం సీలేరులో 6 గంటలకు బయలుదేరి విశాఖపట్నం మధ్యాహ్నం ఒంటిగంటకు చేరుకుంటుందని చెప్పారు. ప్రయాణికులు సౌకర్యార్థం అల్ట్రా డీలక్స్ బస్సును ఏర్పాటు చేశామన్నారు. సీలేరు నైట్ హాల్ట్ బస్సు పునరుద్ధరణ పట్ల స్థానిక ఎంపిటిసి సాంబమూర్తి ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

తాటిచెట్టు పై నుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మోతుగూడెం

చింతూరు మండలం, మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కొత్తపల్లి గ్రామనికి చెందిన సోదే వెంకయ్య శనివారం తాటి చెట్టు ఎక్కి ప్రమాదశాత్తు కాలు జారీ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మోతుగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలంలో వెంకయ్య మృతదేహం

జగనన్న సురక్షపై అవగాహన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని కింద్ర, లబ్బర్తి సచివాలయాల్లో ఎంపీడీవో లోకుల యాదగిరేశ్వరావు ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ వాలంటీర్లకు జగనన్న సురక్షపై శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపిపి గోము వెంకటలక్ష్మి, మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎంపీడీవో యాదగిరేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ వాలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, సచివాలయం ఉద్యోగులు జగనన్న సురక్ష కార్యక్రమం గురించి ఇంటికి వెళ్లి వివరించాలని సూచించారు. పలు ధ్రువీకరణ పత్రాలు, పథకాలకు సంబంధించిన సమస్యలపై ప్రజల నుండి అర్జీలు స్వీకరించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కింద్ర, లబ్బర్తి పంచాయతీల సర్పంచ్‌లు భూసరి సత్యనారాయణ, మిరియాల సత్యవతి, పంచాయితీ కార్యదర్శులు, గ్రామ వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ యాదగిరేశ్వరరావు

విద్యుత్ ఛార్జీల పెంపుపై...

వామపక్షాల నిరసన

ప్రజాశక్తి-పాడేరు: కేంద్ర ప్రభుత్వ విధానాలకు తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో పాడేరు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఎల్.సుందరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి సత్యనారాయణ మాట్లాడుతూ, కేంద్ర బిజెపి, రాష్ట్ర వైసీపీ ప్రభుత్వం కలిసి ప్రజలపై భరించలేని విద్యుత్ బారాన్ని మోపుతూ మరోవైపు విద్యుత్ స్మార్ట్ మీటర్లు విధానం తీసుకోచ్చి పేద ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. సామాన్యులను దోచి కార్పొరేట్ల జేబులు నింపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పెద్దఎత్తున పోరాటమే మార్గమన్నారు. పేదవాడి నడ్డి విరిచేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న విద్యుత్ చార్జీలు పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో తిరుగుబాటు తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సీపీఎం నాయకులు కూడా రాధా కృష్ణ, చిట్టిబాబు, సింహాచలం, పోతురాజు లక్ష్మణరావు, ప్రభుదాస్, చిన్నారావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.




ముంచంగిపుట్టులో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ముంచంగిపుట్టు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడం సరికాదని సిపిఎం మండల కార్యదర్శి పి.భీమరాజు తెలిపారు. మండల విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రూ ఆఫ్ సర్దుబాటు చార్జి పేరుతో ప్రజలపై అనవసర పన్నుల భారాన్ని మోపుతుందని మండిపడ్డారు. పాలకులు, సామాన్య ప్రజల కష్టార్జితాన్ని దోచి కార్పొరేట్లకు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన విద్యుత్ విధానాలతో ప్రజలకు నడ్డి విరుస్తున్నారనీ మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాటంలో ప్రజలందరూ మమేకమై ప్రతిఘటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీల భారాలు తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కే.త్రినాథ్, ఎంఎం శ్రీను, జి నారాయణ, కే.నర్సయ్య, జీనబంధు, రాందాస్, డోంబ్రు పాల్గొన్నారు.



పాడేరులో నినాదాలు చేస్తున్న వామపక్షాల నేతలు



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి మత్స్యలింగం

జగనన్న సురక్షతో లబ్ధి

ప్రజాశక్తి -హుకుంపేట: జగనన్న సురక్షతో పేదలకు లబ్ధి చేకూరుతుందని జెడ్పిటిసి రేగం మత్స్యలింగం తెలిపారు. మండలంలోని రాప పంచాయతీ రాప గ్రామంలో జెడ్పిటిసి శనివారం పర్యటించారు. ఇంటింటికి వెళ్లి జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి అందిస్తున సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేసేందుకె జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అర్హత ఉన్న కూడా సంక్షేమ పథకాలు అందలేని వారికి జగనన్న సురక్ష చేపట్టడం జరిగిందని తెలిపారు. కుల, మరణ, జనన, వివాహ ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్ లావాదేవీలు, ఆధార్‌కు ఫోన్ అనుసంధానం, పంట సాగు హక్కు కార్డు వంటివి ప్రతి పేదవాడికి అందాలన్నదే జగనన్న సంకల్పం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోప్పల లక్ష్మయ్య, ఎంపీటీసీ కోరాబు వెంకట్, మాజీ ఎంపీటీసీ శోభ.. ధర్మయ్య దొర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా జగనన్న కిట్లు పంపిణీ చేయాలి

ఎంపిడిఒ పూర్ణయ్య

ప్రజాశక్తి-పెదబయలు: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులతో శనివారం ఎంపీడీఓ ఎల్.పూర్ణయ్య, మండల విద్యాశాఖదికారి జోసఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సమేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ, జగనన్న కిట్స్‌ను ప్రతి ఒక్క విద్యార్థికి పారదర్శకంగా పంపిణీ చేయాలన్నారు.బడి ఈడు చిన్నారులందర్నీ పాఠశాలలో చేర్పించి నమోదుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. సచివాలయంలో ఉన్న వెల్ఫేర్ అసిస్టెంట్, గ్రామ వాలంటీర్ల సహకారంతో బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఆదేశించారు. నాడు నేడు పనులకు సంబంధించిన పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా చూడాలన్నారు. నిర్దిష్ట గడువులోపు పనులు పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం జులై 1 నుండి ప్రతి గ్రామ సచివాలయంలో జరుగుతంఉదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ పూర్ణయ్య

విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి-పెదబయలు: అల్లూరి జిల్లా ముంచింగి పుట్టు మండలం దారేలా పంచాయతీ డింగూడా గ్రామానికి చెందిన లాస్య (9) విశాఖపట్నం జిల్లా ప్రతిభ ఇన్స్టిట్యూట్ (పెందుర్తి)లో విద్యను అభ్యసిసుంది. నవోదయ ఎంట్రన్స్‌లో 100 కు 90 మార్కులు సాధించి ప్రతిభను చాటింది. ఈ మేరకు గిరిజన సంఘం పూర్వపు జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు అభినందించారు. చిన్న వయసులోనే 100 కి 90 మార్కులు సాదించడం సామాన్యమైన విషయం కాదని సన్నిబాబు కొనియాడారు. లాస్య బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

26న ఆరోగ్య శాఖ మంత్రి పర్యటన

ప్రజాశక్తి- పాడేరు:- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజని పాడేరు ఏజెన్సీ పర్యటన ఖరారు అయింది. ఈ నెల 26న సోమవారం ఆమె పాడేరులో పర్యటించి వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. తొలిసారిగా మంత్రి పాడేరు ఏజెన్సీలో పర్యటిస్తున్నారు. ఈనెల 25న ఆదివారం రాత్రి ఆమె విశాఖ చేరుకొని అక్కడే బస చేయనున్నారు. సోమవారం ఉదయం విశాఖపట్నం నుంచి బయలుదేరి పాడేరు వస్తారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రి రజిని ఉదయం 10:30 గంటలకు పాడేరులోని గురుకుల బాలికల కళాశాలలో జరిగే సికిల్ సెల్ ఎనీమియా స్కానింగ్ కిట్స్ ప్రారంభోత్సవం చేస్తారు. అనంతరం అల్లూరి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని వైద్య ఆరోగ్య సేవలపై జరిగే సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం భోజనానంతరం పాడేరు జిల్లా కేంద్రంలో నిర్మితమవుతున్న మెడికల్ కళాశాలకు చేరుకొని పరిశీలిస్తారు. అనంతరం పాడేరు లోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని సందర్శిస్తారు. ఇక్కడ రోగులకు అందే సేవలను తదితర వాటిని పరిశీలిస్తారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు విశాఖపట్నం బయలుదేరి వెళతారు.

మత్స్యకారుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి:హెటిరో పైప్ లైన్ ఏర్పాటును అడ్డుకుంటామని మత్స్యకారులు స్పష్టం చేశారు. కంపెనీ కొత్తగా వేస్తున్న పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 564వ రోజుకు చేరింది. శనివారం శిబిరం వద్ద మత్స్యకారులు పైపులైన్ కు వ్యతిరేకంగా మోకాళ్ళపై నిలబడి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పైపులైన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ మత్స్యకార జేఏసీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పిక్కి స్వామి మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకొని ఎట్టి పరిస్థితుల్లోనూ పైపులైనుకు అనుమతులు ఇవ్వకూడదన్నారు. న్యాయం జరిగే వరకూ పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు చేపల సోమేశ్, వాసపల్లి నూకరాజు, కోడా కాశీరావు, కొత్తవాల జగ్గా, పిక్కి ఆనంద్, పిక్కి రాజు, వాసపల్లి స్వామి, పిక్కి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

నల్లరాయి క్వారీ, ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలలో...

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-రోలుగుంట:నల్లరాయి క్వారీ, ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలలో తక్షణమే మంచినీటి సమస్య పరిష్కారం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శనివారం నర్సీపట్నం ఆర్డీవో జయరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ, రోలుగుంట కేంద్రంతో పాటు 8 గ్రామాల ప్రజలు గత ఐదు రోజుల నుండి మంచినీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. క్వారీ ప్రభావిత గ్రామాల్లో ఫ్లోరైడ్ నీరు కారణంగా రోగాల బారిన పడి ఆత్యయంలో వస్తున్నాయన్నారు. తొమ్మిది గ్రామాల మధ్యలో 30 నల్లరాయి క్వారీలు కార్యకలాపాలతో భూగర్భ జలాలు అడుగంటి ఫ్లోరైడ్ మారి ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యకు గురవుతున్నారన్నారు. ఇటువంటి తరుణంలో క్వారీ యాజమాన్యం సిఎస్ఆర్ నుంచి కనీసం మినరల్ వాటర్ ప్లాంట్‌లోనైనా నీరు సరఫరా చేయడం లేదన్నారు. గతంలో పర్యావరణ అనుమతుల కోసం గ్రామసభలో ఏర్పాటు చేసేటప్పుడు ప్రజల కోసం మంచినీరు, వైద్యం వంటి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని మర్చి పోయారన్నారు. జానకిరాంపురం గ్రామం నుండి లిఫ్ట్ ద్వారా పంపింగ్ చేసే రోలుగుంట మండల కేంద్రానికి నీరు సరఫరా చేసే బోరు మరమ్మతులకు గురి కావడంతో మంచినీటికి తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని ఆర్డీవోకు వివరించారు. దీనిపై స్పందించిన ఆర్డీవో రోలుగుంట మండల తహశీల్దార్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కారం చేయాలని ఫోన్‌లో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:ధర్మవరం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు ఈనెల 25న అంతరాయం ఏర్పడనుందని కొరుప్రోలు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ డి.రవి తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులకు ఇచ్చిన సమాచారం మేరకు కొరుప్రోలు సెక్షన్ పరిధిలోని ధర్మవరం సబ్ స్టేషన్ లో 11 కెవి లైనులు ఏర్పాటు చేయుటకు గాను ఆదివారం ఉదయం పది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. దీంతో సబ్ స్టేషన్ పరిధిలోని ధర్మవరం, గెడ్డపాలెం వ్యవసాయ సంబంధిత లైనుకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ విషయాన్ని ధర్మవరం సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పైనాపిల్, పనస అమ్మకాల జోరు



12వ మైలురాయి జంక్షన్‌లో విక్రయానికి సిద్ధం చేసిన పైనాపిల్, పనస

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఏజెన్సీలోని పైనాపిల్, పనస అమ్మకాలు ప్రారంభమయ్యాయి. గత రెండు వారాల నుంచి వంట్లమామిడి, 12వ మైలురాయి జంక్షన్ లో పైనాపిల్ మార్కెట్ భారీగానే జరుగుతోంది. సలుగు, దేవాపురం, ఐనాడ, వంట్లమామిడి, మోదాపల్లి పంచాయతీల పరిధిలో గిరిజన రైతులు సుమారు 500 ఎకరాల్లో పూర్వం నుంచి పైనాపిల్ పంట తోటలను సాగు చేస్తున్నారు. చింతపల్లి, జి.మాడుగుల, డుంబ్రిగుడ మండలాల్లో కూడా పైనాపిల్ తోటలు ఉన్నాయి. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో పైనాపిల్ పంట దిగుబడి దశకు చేరుకోవడంతో వాటిని సేకరించిన గిరిజన రైతులు వంట్లమామిడి ప్రాంతంతో పాటు గ్రామాల్లో వారపు సంతలో విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. పైనాపిల్ సైజును బట్టి రూ.15ల నుంచి రూ.25ల ధరతో గిరిజనులు వ్యాపారులకు అమ్మకాలు చేస్తున్నారు. ఏజెన్సీలో సేంద్రియ పద్ధతిలో గిరిజనులు సాగు చేసే పైనాపిల్ మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. మైదాన ప్రాంతానికి చెందిన వర్తకులు ఏజెన్సీ ప్రాంతానికి వచ్చి రైతుల నుంచి వాటిని కొనుగోలు చేసి చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం, నర్సీపట్నం, తుని ప్రాంతాల్లోని మార్కెట్ లలో విక్రయిస్తున్నారు.

భారీగా పనసకాయల వ్యాపారం:

పనసకాయలు కూడా పక్వానికి రావడంతో గిరిజనులు వాటిని కూడా అమ్మకాలు ప్రారంభించారు. పాడేరు పాత బస్ స్టాండ్, మినుములూరు, వడ్డమామిడి, 12వ మైలురాయి జంక్షన్ లో పనసకాయల వ్యాపారం ప్రారంభమైంది. వంట్లమామిడి, మినుములూరు వారపు సంతల్లో పనసపండ్ల వ్యాపారం భారీగానే జరుగుతోంది. స్థానికంగా ఉన్న రిటైల్ వ్యాపారులు పనస పండ్లను అమ్మకాలు చేపడుతున్నారు. సైజును బట్టి పనసకాయను ప్రస్తుతం రూ.70 నుంచి రూ.100 ధరతో అమ్ముతున్నారు.

ప్రభుత్వ సాయం అందించాలి..

గిరిజన ప్రాంతంలో వందల ఎకరాల్లో పైనాపిల్ తోటలు సాగు చేస్తున్న గిరిజన రైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందడం లేదు. దీంతో తమకు తెలిసిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని గిరిజన రైతులు పైనాపిల్ తోటల పెంపకాన్ని చేపడుతున్నారు. వారికి మార్కెటింగ్ సౌకర్యాన్ని ప్రభుత్వం నుంచి ఎటువంటి తోడ్పాటు అందడం లేదు. మైదాన ప్రాంతానికి చెందిన వర్తకులు విక్రయించడం, పర్యాటకులు, ప్రయాణికులకు అమ్మకాలు చేసుకోవడం తప్పా వేరే ఏ రకంగానూ విక్రయాలు చేసే అవకాశం లేదు.

'హైడ్రో పవర్'పై సజ్జల హామీ బూటకం



మాట్లాడుతున్న నాయకులు

వైసిపి ఎంపిపిల ప్రకటన హాస్యాస్పదం
ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి -పాడేరు:చింతపల్లి ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం ఉండదని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి హామీనివ్వడం వట్టి బూటకమని ఎపి ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సాగిన ధర్మన్న పడాల్, పొద్దు బాలదేవ్ అన్నారు. చింతపల్లి, జికె వీధి ఎంపీపీలు సజ్జలను కలిసి గిరిజన సమస్యలు వివరించామని ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందని ఇది కేవలం ప్రజల్ని మభ్య పెట్టడానికేనని వారు విమర్శించారు. చింతపల్లి ,జికె విది ,కొయ్యూరు మూడు మండలాలకు చెందిన ఆదివాసి ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం మండల కమిటీలతో చింతపల్లిలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం క్యాబినెట్లో నిర్ణయం చేస్తూ హైడ్రో ప్రాజెక్టుల నిర్మాణం ఆదాని గ్రూప్, శ్రీ శిరిడి సాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్‌కు అప్పగించాలని తీర్మానం చేస్తే దానిని కాదని సజ్జల రామకృష్ణారెడ్డి హామీ ఇవ్వడం అనేది ప్రజలను మభ్య పెట్టడమేనని ఎద్దేవా చేశారు. గిరిజన ప్రాంతంలోని ఆసుపత్రుల్లో డాక్టర్ల, సిబ్బంది, మందుల కొరత ఉందని, చాలీచాలని వసతులు ఉన్నాయన్నారు. అనారోగ్యంతో ఉన్న రోగి సకాలంలో ఆసుపత్రికి చేరుకున్నా సరైన వైద్యం అందని పరిస్థితి మన్యంలో నెలకొందన్నారు. ఈ సమస్యలను వైసీపీ ప్రజా ప్రతినిధులు పట్టించుకోలేదన్నారు. జీవో 3పై ఆదివాసీ గిరిజన సంఘంగా రివ్యూ పిటిషన్ వేయడం జరిగిందని, దీనిపై ఈ ప్రభుత్వానికి కనీసం చిత్తశుద్ధి లేదన్నారు. జీవో 3 కు సంబంధించిన రివ్యూ పిటిషన్ పరిశీలించాలని సుప్రీంకోర్టులో ప్రభుత్వం పిటిషన్ వేయలేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా జరుగు తున్నాయన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి గిరిజనుల పక్షపాతి అని చెప్పుకునే వైసీపీ ప్రజాప్రతినిధులుకళ్ళు మూసుకుని తిరుగుతున్నారని విమర్శించారు. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆదివాసీలంతా ఆందోళన చేస్తుంటే వైసీపీ ప్రభుత్వం స్పందించలేదని, గిరిజనుల మనోభావాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే వైసిపి ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు సాగిన చిరంజీవి, చంటిబాబు, కొర్ర బాలయ్య, పిల్లో సింహాచలం, రాంబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.జీవన్‌కృష్ణ, కార్తీక్ లు పాల్గొన్నారు.

గిరిజనేతరుల హక్కు పత్రాలు రద్దు చేయాలని..

పనసలపాడు గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:గిరిజన వారసత్వ భూముల్లో గిరిజనేతరులకు ఇచ్చిన హక్కు పత్రాలు రద్దు చేయాలని, ఈ విషయమై రోలుగుంట తహసిల్దార్ పై చర్యలు తీసుకోవాలని రోలుగుంట మండలం పనసలపాడు గిరిజనులు నర్సీపట్నం ఆర్డిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ, రోలుగుంట మండలం పనసలపాడు రెవెన్యూ పరిధిలో గిరిజన భగత తెగకు చెందిన ఆదివాసి గిరిజనులు జీవనం సాగిస్తున్నామని తెలిపారు. తమకు వారసత్వంగా వస్తున్న జిరాయితి భూముల హక్కు పత్రాలు కలిగి ఉన్నామని, జగనన్న భూ రీసర్వేకు పలసలపాడు గిరిజన గ్రామాన్ని మొదటి విడతగా ఎంపిక చేసి డ్రోన్ సర్వే చేశారన్నారు. రెవిన్యూ అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు కుమ్మక్కై గిరిజన జిరాయితి భూములు సర్వే నెంబర్ 8-1.6-9.6-1-4.3లో 15 ఎకరాలను గిరిజనేతరులైన మాజీ సర్పంచ్ తమటాపు సత్యం నాయుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు పేరు మీద జగనన్న భూహక్కు పత్రాలు ఇవ్వడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. గిరిజనేతరులకు హక్కుపత్రాలు ఇచ్చిన తహసిల్దార్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు కే గోవిందరావు, గెమ్మెల నూకినాయుడు, చిన్నబ్బాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అయ్యన్న

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ :మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశంతో నర్సీపట్నం నియోజకవర్గంలో శనివారం బస్సు యాత్ర ప్రారంభించారు. దీనిలో భాగంగా స్థానిక బంగారురాజు థియేటర్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు అధ్యక్షత యాత్రను చేపట్టారు. నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ, తన పదవీ కాలంలో నియోజకవర్గంను ఎంతో అభివృద్ధి చేశానన్నారు. విద్యా వైద్యపరంగా నర్సీపట్నం నియోజవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా సత్యనారాయణ స్వామి దేవాలయం దగ్గర కళ్యాణ మండపం, ఇంటింటికి నీరు ఇప్పటికీ అందించలేక పోయారని విమర్శించారు. ప్రతి విద్యార్థికి అమ్మఒడి ఇస్తానని చెప్పి 2000 రూపాయల కోత పెట్టి మహిళలను మోసం చేశాడని అన్నారు. ఇటీవల రాష్ట్ర మహానాడు కార్యక్రమంలో మ్యానిఫెస్టో విడుదల చేయడంతో జగన్మోహన్ రెడ్డికి భయం పుట్టుకుందన్నారు.

మాజీ స్పీకర్ ప్రతిభ భారతి మాట్లాడుతూ, చంద్రబాబుకు సంపద సృష్టించడం తెలుసని జగన్మోహన్ రెడ్డికి దోచుకోవడం మాత్రమే తెలుసని అన్నారు. రాష్ట్రంలోకి సంక్షేమ పథకాలు తెచ్చింది మొట్టమొదట ఎన్టీ రామారావు అని దళితులకి ఎన్నో పథకాలు అందజేశారన్నారు. దళిత మహిళగా గుర్తించి స్పీకర్ పదవిని కట్టబెట్టారని ఆమె తెలిపారు.దళితుల్ని మోసం చేస్తున్న జగన్ రెడ్డికి బుద్ధి చెప్పాలన్నారు. అన్న క్యాంటీన్లు ఎందుకు రద్దు చేశారో తెలియజేయాలన్నారు.బాలయోగి వంటి మహా వ్యక్తులను స్పీకర్లుగా తీర్చిదిద్దిన ఘనత ఒక తెలుగుదేశం పార్టీ దేనిని ఆమె అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీలకు గురుకులాలను ఏర్పాటు చేసింది అన్న నందమూరి తారక రామారావు అని పేదవారిని, వికలాంగులను గుర్తించి పెన్షన్ ఇచ్చింది ఆయనేనన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కళా వెంకట్రావు, బండారు సత్యనారాయణ, రామానాయుడు, కేఎస్ఎం రాజు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, జడ్పిటిసి సుకల రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ర్యాలీ

ప్రజాశక్తి -రావికమతం:రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వెలుగు ఎపిఎం తిలక్ సూచించారు. మండల కేంద్రం నాలుగు రోడ్ల కూడలి వద్ద వెలుగు సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ, రోడ్డు నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. రోడ్డు మార్గం గుండా వెళ్లేటప్పుడు సూచికలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అతివేగంగా, మద్యం సేవించి డ్రైవ్ చేయకూడదన్నారు. హెల్మెట్ ప్రతి ఒక్కరు ధరించి ప్రయాణాలు సాగించడం మంచిదన్నారు. రోడ్డు ప్రమాదాలతో అనేకమంది ప్రాణాలను పోగొట్టుకునే పరిస్థితి నెలకొంటుంద అన్నారు.యువత స్పీడు డ్రైవింగ్‌తో రోడ్డు ప్రమాదంలోనే అత్యధికంగా మరణించడం జరుగుతుందన్నారు. రోడ్డుకు ఇరువైపులా వెనుక ముందు చూసుకొని ప్రయాణం సాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ఐకెపి సిబ్బంది పలువురు పాల్గొన్నారు.



సీలేరులో కురుస్తున్న వర్షం

సీలేరులో వర్షం

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో శనివారం వర్షం కురిసింది. రుతుపవనాలు కారణంగా రెండు మూడు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం శనివారం మబ్బులతో కూడిన వాతావరణం నెలకొంది. శనివారం తెల్లవారుజాము నుంచి 10 గంటల వరకు వర్షం కురిసింది. కొంత సమయం విరామం అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు పూర్తిస్థాయిలో మేఘావృతమై ఒంటిగంట వరకు భారీ వర్షం కురిసింది. తుఫాన్ కారణంగా ఆంధ్ర ఒడిశా సరిహద్దు, సీలేరు పరిసర ప్రాంతాల్లో చెదురు ముదురు వర్షాలు పడటంతో చల్లటి వాతావరణం నెలకొంది.

బాలరేవులలో ప్రతి గురువారం సంత

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని బాలరేవుల గ్రామంలో ప్రతి గురువారం సంత ఏర్పాటుకు సిద్ధం చేసినట్టు పీఏసీఎస్ చైర్మన్ సుమర్ల సూరిబాబు తెలిపారు. శనివారం ఆయన స్థానిక గిరిజనులతో మాట్లాడుతూ బాలరేవుల వరకు బీటీ రోడ్డు ఉండడంతో వాహనాలు వచ్చే అవకాశముందన్నారు. అక్కడ సంత ఏర్పాటుతో సుమారు 15 గ్రామాల గిరిజనులకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. బాలరేవుల నుంచి లోయలపాలెం వెళ్లే మార్గంలో ఉన్న స్థలంలో దీనిని ఏర్పాటు చేశామన్నారు. దీనిపై ఈ ప్రాంత గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు. సంతపాకల గ్రామంలో కూడా సంత ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని సూరిబాబు చెప్పారు.

రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షం తొలగింపు

ప్రజాశక్తి - సీలేరు : సీలేరు-భద్రాచలం ప్రధాన రహదారికి అడ్డంగా పడి ఉన్న భారీ వృక్షాన్ని ఎట్టకేలకు స్థానిక అటవీశాఖ సిబ్బంది చొరవతో శుక్రవారం అర్ధరాత్రి 1.30 గంటలకు తొలగించి ఈ మార్గంలో రాకపోకలు పునరుద్ధరించారు. శుక్రవారం ఉదయం నుంచి స్థానిక అటవీశాఖ గార్డు చిట్టిబాబు ఆధ్వర్యంలో గిరిజనులతో భారీవృక్షాన్ని తొలగించడానికి శత విధాల ప్రయత్నించారు. తేనెటీగల అడ్డంగా మారడంతో శుక్రవారం సాయంత్రానికి చెట్టుని తొలగించడానికి సాధ్యపడలేదు. అదేరోజు రాత్రి చుట్టుపక్కల గ్రామ గిరిజనులు పిలిపించి చెట్టును తొలగించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో రవాణా సౌకర్యానికి అడ్డంకులు పోయాయి. అటవీ శాఖ సిబ్బందికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ఎల్ఐసి డివిజనల్ స్థాయి క్రీడలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎల్ఐసి డివిజనల్ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ అథ్లెటిక్ మీట్ క్రీడలు శనివారం రైల్వే స్టేడియంలో ముగిశాయి. ముఖ్య అతిథిగా ఎల్ఐసి పర్సనల్ మేనేజర్ భగవాన్ ప్రసాద్ హాజరై విజేతలకు ఆగస్టులో కర్ణాటకలోని ఉడిపిలో జరగనున్న జోనల్ స్థాయి క్రీడలకు ఎంపికైన వారికి నగదు పురస్కారాలు అందించారు. ఈ రోజు ముగిసిన పోటీల్లో షటిల్ టోర్నమెంట్ విజేతలుగా మొదటి స్థానంలో ఎల్.సురేంద్ర, రెండో స్థానంలో బి.సురేంద్ర, మూడో స్థానంలో ఉదయ్ సాగర్ నిలవగా, మహిళల విభాగంలో మొదటి స్థానంలో శ్రీలత వర్మ నిలిచి జోనల్ మీట్‌కు అర్హత సాధించారు. అథ్లెటిక్స్ విభాగంలో విజేతలుగా రేవంత్ (100 మీటర్లు), ప్రశాంత్ (200 మీటర్లు), గౌతమ్ (400 మీటర్లు), దివాకర్ (800 మీటర్లు), కిరణ్ (1500 మీటర్లు) నిలిచారు. రాజ్ కిరణ్ (షాట్‌పుట్), రాజా గణపతి (లాంగ్ జంప్), పార్థసారథి (హైజంప్) విభాగాల్లో అర్హత సాధించారు. వాలీ బాల్ జోనల్ మీట్‌కు రాకేష్ వర్మ, ప్రవీణ్, హరిగోపాల్, నూకేశ్వరరావు అర్హత పొందారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి స్పోర్ట్స్ ప్రమోషనల్ బోర్డు సభ్యులు డివిఎస్‌వై.శర్మ, ఎల్ఐసి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శంకర్ నారాయణ, క్లబ్ సెక్రటరీ బి.శ్రీనివాస్ సెలెక్టర్లు విఎల్ఎన్ శాస్త్రి, వెంకటకుమార్, సిహెచ్.సింహాచలం పాల్గొన్నారు.

ఎల్ఐసి పరిరక్షణకు ఉధృత పోరాటం

ఎఐఐఇఎ జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్
విశాఖలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసిని కాపాడుకునేందుకు రానున్న కాలంలో ఉధృత పోరాటాలు నిర్వహించాలని ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ పిలుపునిచ్చారు. విశాఖలోని ఎంవిపి కాలనీ సెక్టార్ - 5లో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసిఇయు) విశాఖపట్నం డివిజన్ నూతన భవన శంకుస్థాపన కార్యక్రమం శనివారం ఉదయం ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. వేణుగోపాల్, ఎస్‌సిజెడ్ఐఇఎఫ్ ప్రధాన కార్యదర్శి టివిఎన్ఎస్.రవీంద్రనాథ్ ముఖ్య అతిథులుగా పాల్గొని శంకుస్థాపన చేశారు. అనంతరం ఐసిఇయు అధ్యక్షురాలు ఎం.కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎంవిపి కాలనీలోని గిరిజన్ భవన్‌లో సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాల్ మాట్లాడుతూ యూనియన్ భవనాలు కేవలం ఎల్ఐసి కార్యక్రమాలకు మాత్రమే కాకుండా ఇతర ట్రేడ్ యూనియన్ల సభలు, సమావేశాలు, అభ్యుదయకర కార్యక్రమాలకూ వేదికగా నిలవాలన్నారు. విశాఖలో తలపెట్టిన ఐసిఇయు భవనం 2024 చివరినాటికి పూర్తయ్యేలా చూడాలన్నారు. బహుముఖ సేవలకు ఈ భవనం ఆలవాలంగా నిలవాలన్నారు. భవన నిర్మాణానికి ఎల్ఐసి ఉద్యోగులంతా విరాళాలు అందించాలని కోరారు. ప్రస్తుతం రూ.43 లక్షల కోట్ల ఆస్తులను ఎల్ఐసి కలిగి ఉందని, పబ్లిక్ సెక్టార్‌లో గవర్నమెంట్ సెక్టార్ షేర్లు పెరగకుండా ప్రైవేట్ వ్యక్తులు అడ్డుకుంటున్నారని తెలియజేశారు. అదానీ కుంభకోణంపై ప్రభుత్వం స్పందించకపోగా ఎల్ఐసిని నిర్వీర్యపరిచేందుకు కుట్రలు చేస్తోందన్నారు. మరొక ముఖ్య అతిథి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఐసిఇయు విశాఖపట్నం డివిజన్ దేశంలోనే ఎంత ఖ్యాతి పొందిన యూనియన్ అని కొనియాడారు. నూతన భవనం భవిష్యత్తులో ఉద్యమ కేంద్రంగా మారాలని ఆకాంక్షించారు. ఎల్ఐసి ప్రయివేటీకరణకు జరుగుతున్న కుట్రలను వివరించారు. భవిష్యత్తులో ట్రేడ్ యూనియన్లపై మరిన్ని దాడులు జరగనున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ ఎల్ఐసిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. ఐసిఇయు నూతన భవనం ఎంవిపి ప్రాంతంలో ఉన్న లక్ష మంది ఉద్యోగులు, పెన్షనర్లు, అసంఘటిత కార్మికులకు వేదిక కావాలని ఆకాంక్షించారు. సాధారణ గృహాల మధ్య ఈ భవన నిర్మాణం తలపెట్టారని, రానున్న కాలంలో ప్రజలందరితో మమేకమై ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, ఎల్ఐసి క్లాస్ 1 అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.వెంకటరావు, ఎన్ఎఫ్ఐఎఫ్‌డబ్ల్యుఐ ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్, ఎల్ఐసి ఎఒఐ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ ఠాగూర్, ఎల్ఐఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఎల్ఐసి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు జి.విజయకుమార్, ఎల్ఐసి ఒబిసి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హరినాథ్ కుమార్, ఐసిఆర్ఇఎ ప్రధాన కార్యదర్శి ఆర్.పాండురంగడు, అధ్యక్షులు కె.మోహన్‌రావుతోపాటు ఎల్ఐసి పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు, నిర్మాణదారుడు రెడ్డి వెంకటేశ్వరరావు, ఉమెన్ కన్వీనర్ జి.సూర్యప్రభ, ఎల్ఐసి అనుబంధ అసోసియేషన్ల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మరణించిన

జివిఎంసి కార్మికుని కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి ఎలక్ట్రికల్ విభాగంలో కాంట్రాక్టు కార్మికునిగా పనిచేస్తూ విద్యుదాఘాతంతో మృతిచెందిన పిట్ల సూర్రెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రాత్రి జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, నాయకులు రమణ మాట్లాడుతూ సూర్రెడ్డి తొమ్మిది సంవత్సరాలుగా జివిఎంసి ఎలక్ట్రికల్ విభాగంలో కాంట్రాక్ట్ కార్మికునిగా పనిచేస్తున్నారని చెప్పారు. శనివారం మాధవధార వద్ద ఎలక్ట్రికల్ పని చేస్తుండగా, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడని చెప్పారు. అతనికి ఎటువంటి రక్షణ పరికరాలనూ కాంట్రాక్టర్‌గానీ, జివిఎంసిగానీ సమకూర్చకపోవడం కూడా ఈ ప్రమాదానికి కారణమని చెప్పారు. కాగా సూర్రెడ్డి మృతదేహాన్ని వైద్య పరీక్షల నిమిత్తం కెజిహెచ్‌కు తరలించగా అక్కడా కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ముందుగా కెజిహెచ్ వద్దకు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి అతని కుటుంబ సభ్యులను యూనియన్ నాయకులు ఓదార్చారు.

అక్కడ నుంచి కార్మికులు రాత్రి 8 గంటల ప్రాంతంలో జివిఎంసి ప్రధాన కార్యాలయం వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, అతని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, కుటుంబానికి ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూర్రెడ్డి మరణానికి పూర్తి బాధ్యత కాంట్రాక్టర్ వహించాలన్నారు. ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా జివిఎంసి కూడా బాధ్యత వహించాలన్నారు. తాము కోరిన మేరకు డిమాండ్లను అంగీకరించాలని, లేకుంటే ఆదివారం జివిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. జివిఎంసి అధికారులు యూనియన్ నాయకులతో చర్చలు నిర్వహిస్తున్నారు.

గొందిపాకలలో తాగునీటి కష్టాలు

- రోడ్లు, రవాణా సౌకర్యాలు లేక అవస్థలు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం, దారకొండ పంచాయతీ పరిధి గొందిపాకల గ్రామంలో సరైన తాగునీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆ గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు శనివారం గొందిపాకల గ్రామస్తులు తమ సమస్యలను వీడియో ద్వారా మీడియాకు తెలియజేశారు. గొందిపాకల గ్రామంలో సుమారు 50 ఏళ్ల నుంచి జీవిస్తున్నామని, ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా తమకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో రెండు బోరు బావులు, ఒక నుయ్యి ఉన్నాయన్నారు. బోరు బావులు మరమ్మతులకు గురి కావడంతో ఒక బోరు నుండి నీరు రావడం లేదని, మరో బోరు నుంచి బురద నీరు వస్తుందని, గత్యంతరం లేక వాటినే తాగి రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీటి సౌకర్యం కల్పించాలని అనేకసార్లు కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచ్ నడిగట్ల రాజు దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోలేదని ఆరోపించారు. బోరుబావులు, నుయ్యి వద్ద కాంక్రీట్‌తో ప్లాట్ ఫారాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్‌ను కోరినా స్పందన లేదన్నారు. ఇటీవల ఇంటింటికి కుళాయిలు ఇస్తామని పైప్‌లైన్ వేశారుగాని, మంచినీటి సౌకర్యం మాత్రం కల్పించలేదని పేర్కొన్నారు. గ్రామానికి రహదారి సౌకర్యం, గ్రామంలో సిసి రోడ్లు లేవని, దీంతో రవాణా సౌకర్యం లేక అనేక ఇబ్బందులు గురికావాల్సి వస్తుందని వాపోయారు. పాఠశాల, అంగన్వాడీ కేంద్రం కూడా లేవన్నారు. సరైన నివాస గృహాలు కూడా లేవని తెలిపారు. ఇటీవల ఎస్పై రామకృష్ణ తమ గ్రామాన్ని సందర్శించినప్పుడు సమస్యలన్నీ విన్నవించామని, అయినా ఏ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదన్నారు. గ్రామ సచివాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం శూన్యమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచ్ నడిగట్ల రాజు స్పందించి వెంటనే తమ గ్రామానికి మంచినీరు, రోడ్లు, రవాణా సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

అంగన్వాడీల సమస్యలపై నేటి నుంచి జీపు జాతా

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, ఆయా సమస్యలను పరిష్కరించాలని, ఐసిడిఎస్‌ను పరిరక్షించాలని కోరుతూ ఈ నెల 25, 26, 27 తేదీల్లో రంపచోడవరం డివిజన్లో జీపుజాతా నిర్వహిస్తున్నట్లు ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.నిర్మల, జిల్లా నాయకురాలు కె.వెంకటలక్ష్మి శనివారం ఓ ప్రకటన తెలిపారు. గ్రాట్యుటీ అమలు, ఉద్యోగ భద్రత, పనికి తగిన వేతనం, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, పని భారం తగ్గించాలని, ఐసిడిఎస్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని తదితర డిమాండ్లతో చేపట్టిన ఈ జీపు జాతా సాగుతుందని చెప్పారు. 25న రాజవొమ్మంగి మండలంలో, 26న అడ్డతీగల, వైరామవరం, గంగవరం, 27న దేవీపట్నం మారేడుమిల్లి మీదుగా రంపచోడవరం చేరుకొని అక్కడ ముగుస్తుందని తెలిపారు. ఈ జీపు జాతాల్లో అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

డౌనూరులో ఎంపిడిఒ పర్యటన

ప్రజాశక్తి-కొయ్యూరు : డౌనూరు పంచాయతీలో శనివారం ఎంపీడీవో లాలం సీతయ్య పర్యటించారు. ముందుగా ఆయన జగనన్న సురక్ష పథకం గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం పలు ఇళ్లను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న సురక్ష ద్వారా సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భవాని, వైసీపీ నేతలు పోతురాజు, సురేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక చికిత్సపై అవగాహన

ప్రజాశక్తి - సీలేరు : ఆశ కార్యకర్తలకు ప్రాథమిక చికిత్సపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. ప్రాథమిక చికిత్సపై ఈ నెల 20వ తేదీ 24వ తేదీ వరకు జరిగిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజలకు వైద్య సిబ్బందికి మధ్య అనుసంధానకర్తలుగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలిన వెంటనే ప్రాథమిక చికిత్స అందించి వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. గ్రామాల్లో వ్యాధుల పరిస్థితి, ప్రజల ఆరోగ్యం స్థితిగతులు ఎప్పటికప్పుడు పిహెచ్‌సి వైద్యాధికారికి సమాచారం ఇవ్వాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను విధుల్లో అమలుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఈఓ పోతురాజు, హెచ్‌వి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.